# తాత్విక సంగీతం

రైలు పరుగెడుతోంది కాలంతో. నల్లమల్లై అడవిని మీటర్‌గేజ్ చీల్చేస్తోంది. కొండల మీద అఘు మేఘాలు. చల్లని గాలి. మబ్బు వాతావరణం. దూరాన కొండల్లో మెరిసే యెండ. రివ్వుమని గాలి తప్పు కొంటోంది.

కంపార్ట్‌మెంట్ తలుపు తీసి, నిలుచొని, సృష్టిని కృష్ణ శల్యపరీక్ష చేస్తున్నాడు. ఒక్కోసారి అన్ని అందాలు కూడ వ్యర్థమై పోతున్నాయి. అతని మనసు ముప్పై యేళ్ళ అనుభవాల మీద, కోర్కెలు మీద, జ్ఞాపకాల మీద గంతులు వేస్తోంది. ఎవరెవరో స్నేహితులు, బంధువులు, ప్రియులు బలవంతంగా కళ్లెదుట కదులుతున్నారు.

సుమతి!

ఈసారి అతని మనసు ఉదయం అప్పుడే సూర్యుని చూసిన మందారం చుట్టూ తిరిగే తుమ్మెదలా ఆగి అంటుకు పోయింది. మడత పడ్డ మందారం రేకులాంటి ఆ పెదవులు ఓమర్ ఖయ్యాం ని బోధ పరుస్తున్నట్టున్నాయి. ప్రియులహృదయాలకు నిత్యస్వాగతమిచ్చే జ్వాలల నిత్యనిగారింపులాంటి తారకలు — ఆ కళ్ళు. పద్మాల ప్రాణం యీ చెక్కిళ్ళలో దాగింది.

కృష్ణ మనసు గంతువేసింది.

కాలేజీలో — సుమతి కూచిపూడి దశావతారాల నృత్యం! ప్రేక్షకులు రంగం మీది రంగుల్లో తన్మయులై పోయారు. పైన నక్షత్రాలు. కృష్ణావతారం — గోపికల్లో కృష్ణుడు. అయ్యో ఆసమీపాన కూచొనేందుకు మృదంగ వాద్యమన్నా వచ్చింది కాదే! అదీ అతని బాధ!

మరో గంతు వేసింది మనసు.

కృష్ణ అక్కడి విషయాలు చూస్తున్నాడు. అతని అవధానం అక్కడ నిశ్చలత పొందింది.

వెలుతురుని చీల్చుకొంటూ రైలు పోతోంది.

హేపా ఎసోషియేషన్ మీటింగ్. ఉపన్యాసాలు. విద్యార్థుల గోల. ఎదురు బెంచీ మీద మెరుపు తీగ. నిశ్చలత్వం పొంది వుంది. జ్ఞానాన్ని మత్తెక్కించే సౌరభం ఆకారంతో వుంది. డాఫిన్ పర్వతాల మీద నల్లనిమేఘాల్లో కత్తులయుద్ధం. బంగాళాఖాతం నిత్యస్తోత్రం పకృతి గాత్రంలా హృదయాలను స్పందిస్తోంది.

ఆమె కదిలింది అక్కడి నుంచి. అతను కదిలాడు ఆమెని కలవాలని. ఆమె ముందు. అతను వెనక. చెప్పుకోవాలని ఒకరు. గడుగ్గాయువించి తప్పుకోవాలని మరొకరు.

ఆమె వేగం హెచ్చుతోంది. అతని సాహసం అనుకరిస్తోంది. చీకటి. ఫ్లాష్‌లు కొట్టి సృష్టి స్నాప్‌లు తీస్తున్నాయి మేఘాలు.

ఆమె కనులు తిరగడం లేదు. అతని పెదవులు కదలడం లేదు.

ఘర్జన—గుండెల్లో!

గాలి. ధూళి వాళ్ళుమీంచి సుళ్ళుతిరిగి పోతోంది.

వర్షం!


జనసంచారం రోడ్డు. మనుష్యుల రొద.

అతని వేగం జంకింది. సాహసం వీగి పోయింది.

పరాభవం ప్రళయ నృత్యం చేసింది.

రెండో దినం తెల్లారే లేస్తూ అనుకొన్నాడు. అనుకొన్నట్టే జరిగితే, తన పాలిట యమునిలా ఆమె భావిస్తే, తన తపనంతా వ్యర్థమయేదే! ఇదీ ఒకందుకు మంచిదే! అందుకు అతనిలో సంతృప్తి. ఒక యువ్వనంలోని కళకోసం తను లొంగి పోకూడదు. ఆమె పెదవుల మీద ఆగిన నవ్వును తన పెదవుల్లో దాచుకోవడం కోసం చవటయ్యి పోకూడదు. ఈ విధంగా పరిచయం

శ్రీపతి



కోరి చేసుకోవడం తనకి తలవంపు. ఆమె కళ క్షణికం. అతని కళ యుగాలు—

అతను వేసిన రంగులచిత్రాలు కనుపించాయి. చలం వూర్వశీ — పురూరవులు, నండూరి యెంకీ—నాయుడు బావలు, బుచ్చిబాబు అమృతం — దయానిధులు, కాళిదాసు శకుంతల— దుష్యంతులు. అవన్నీ ఒక్కొక్కటి ప్రక్కకు తప్పుకొన్నాయి.

ఫీంకరిస్తూ రైలు పోతోంది. చెట్లూ, పుట్టలూ, కాలవలు వెనక్కి జారిపోతున్నాయి.

'జీవితం' అని వేసిన చిత్రం క్షణం మనస్సుని తన వశం చేసుకొంది. సంగీత ప్రవంతిలా సెలయేరు—వసంతంతో మత్తెక్కిన పూలతోట— పదునెక్కినబుల్బులి పిట్టలయౌవన పరవశ గానం, సూర్యోస్తమయానికి పురి విప్పిన మయూర నృత్యం — కొమ్మ మీంచి ఖయ్యాం కనుల్లోకి చూస్తున్న జవరాలి పరవశ దృక్కులు — చేతిలోని చిరు చేదు పానకం — మారిపోయే బుతువులను అలక్ష్యం చేసే తన్మయత — ఆరంగులు సృష్టించిన జీవితం కొన్నాళ్ళు అతన్ని వెర్రిమరపించింది. అదికూడ యిపుడు రుచించ లేదు.

ఆఖరి రంగుల చిత్రం 'తాత్త్విక సంగీతం' నేషనల్ గేలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్స్, మ్యాఢిల్లీ వాళ్ళు అడిగారు. తన తదనంతరం అన్నాడు. అదే అతని ఆఖరి చిత్రం. రెండు సంవత్సరాలయింది. రంగులు, బ్రష్‌లూ ముట్టుకోలేదు. ముట్టుకో దలచలేదు కృష్ణ. ఆచిత్రంలో అతని కోరిక తీరిపోయింది. ఆరంగుల సంకలనంతో అతని ప్రావీణ్యత పరిపూర్ణత పొందింది. ఆ చిత్రంతో అతని చిత్రలేఖనా జీవితం సమగ్రత పొందింది. లేత నీలంకాంతి అనంతంలోకి మృదువుగా ప్రాకి మాయమయింది. మనిషి చనిపోయిన తరువాత శూన్యంలో విన్న సంగీతం మాధుర్యం లోని పరవశతతో రక్తిమ వంపులు తిరిగింది. ఆరిజన్ లైను వెనక శూన్యం. ఆముందు శూన్యం. విశ్వవ్యాప్తమైన ఆత్మ జీవితం పొందడం ఆ నీలకాంతి — అది మళ్ళీ రక్తిమలో కలిసిపోవడం జీవి పరిణామం— ఆ పద్దెనిమిది చదరపడుగుల కాన్వాస్‌లో కలిసిన ఆరేఖల లేతదనం, మృదుత్వం మానవులకు, 'తాత్త్విక సంగీతం' వినిపిస్తుంది. అందుకే ఆ బొమ్మని విడిచిపెట్టలేక పోయాడు. ఈచిన్న ప్రయాణానికి అదో ఆటంకం అనివిడిచిపెట్టాడు. విడిచిపెట్టినపుడు బాధపడ్డాడు. అదో విరహం. ఆ బొమ్మ అడుగున 'యుగాల నిరీక్షణానంతరం నీప్రేరణతో—' అని సంతకం పెట్టాడు.

రైలు మధ్యలో ఆగింది. అక్కడ స్టేషన్ యేం లేదు. గార్డ్ దిగి ఓ థర్డ్‌క్లాస కంపార్టమెంట్‌లో దూరాడు.

జ్ఞాపకాల గొలుసు యెవరో లాగారు. కృష్ణ అందులో లీనమయాడు.

మనస్సు సముద్ర తరంగాల లాలిత్యంలో దాగి నిర్మించుకొన్న స్వప్న సౌధాల్లోకి తొంగి చూసింది.

. . .సుమతి నృత్యం చేస్తోంది. ద్వారానికి ఆనుకొని చూస్తున్నాడు కృష్ణ. కిటికీ లోంచి అస్తమయ కిరణాలు మోసుకొచ్చిన తుషారాల్లో ఆమె నాని నూతన తేజస్సుల నీనుతోంది.

'అలా వుండు — ఆ భంగిమ రంగుల్లో చూపిస్తా'

అంగీకరించదామె.

'ఏం ?'

'రికార్డ్ చేసిన పాటలా నా నృత్యం చవకబారు చేయటానికా ?'

'పిచ్చి సుమతీ! నా చిత్రలేఖనం నా మెకానిజం అనుకొన్నావా ? నాకుంచె రంగుల్లో నీ సౌందర్యం కలిసి భవిష్యత్ తరాల సౌందర్యోపాసకుల హృదయాలని తన్మయత కల్గిస్తుంది. స్కెచ్ గీసుకోనీ—'' అంటాడు. ఆమె గుండె మీద పడిపోతుంది. అతడామెని సాధారణ, సానుకంపాలతో నిమిరి, ' యీ కళలు సర్వ స్వతంత్ర ప్రతిపత్తి కలవి గాబోలు! పోనీలే! యిలా చూడు సుమతీ!'

మల్లెలు చంద్రుని వెన్నెల్లో దాగిపోతాయి. పరిమళ పరివేష్టితమవుతుంది అనుభవం. అవన్నీ అతని సౌప్నసౌధాలు! కూలిపోయిన పేకమేడలు!!

రైలు కదిలింది.

పక్క కంపార్ట్‌మెంట్ కిటికీలోంచి ఓమృదువైన హస్తం. ఇంకో జత లేత బుల్లిచేతులు. ఆ చేయిలో నృత్యభంగిమలోని హస్తవిన్యాసం సుమతిని మళ్ళీ జ్ఞాపకం తెచ్చాయి. ఎవరామె? ఎక్కడికి? బెంగుళూరు నించా? విశాఖేనా? సుమతా? ఆచేతులు ....

అతని కళ్ళముందు కదులుతున్న పెలిగ్రాం. అమ్మ! పెళ్ళిచేసుకోమంటుంది. బతిమాలి ఏడుస్తుంది. ఇష్టం లేదంటాడు. పాతపాటే అమ్మకి యేజ్వరమూ లేదు. ఇదే లోగుట్టు. అమ్మని చూస్తే జాలి. ఎవరితోనో జీవితం గడపడం అసహ్యం. మృగమన్నా పరిచయం లేనిదే ప్రేమించదు.

వెధవ బ్రతుకు. ఎందరో చచ్చారు. భవిష్యత్తులో యీకృష్ణ అని పిలవబడే, ఆత్మగౌరవం గలవ్యక్తి కూడ ఆదేస్థానంలో, ఆనంతమయిన శాంతంలో విశ్రాంతి తీసుకొంటాడు. ఇతని కళ ఎవరు చూస్తారు? ఎవరు ఆనందిస్తారు? ఎవరు బాధపడతారు ? అయ్యయ్యో ఒక స్త్రీ కోసం యెంత బాధపడ్డాడూ అని తనని ఓ వాంగోగా, గాగిన్‌గా వూహించుకొని బాధపడతారు. ఆసానుభూతిమాత్రం యీ ఆత్మకి మిగుల్తుంది.

అందుకే —

జీవిక యాంత్రికం చేసుకొన్నాడు.

ఫారెస్ట్ ఆఫీసర్ — సాయంకాలాల వేట— జీవుల ప్రాణాలతో ఆట—జీవన మరణాల అద్యంతాలలో అంతర్నిబిడమైన తాత్త్విక సందేశాల పర్యాటలలో పాత్రధారి. లంబాడీలు — నృత్యాలు — చూపులు — మర్యాదలు — నదిలో యీత — గుర్రం స్వారీ — రాత్రి నిషా — యంత్రంలా మార్చుకున్న జీవితం అతనికి ఆనందం కల్గించింది.

ప్రక్క కంపార్ట్‌మెంట్‌లోని ఆహస్తం మరో సారి పరిపూర్ణతని ఆహ్వానిస్తున్నట్టు కదిలింది.

రైలు ఆగింది. కదిలింది. అతనికి తెలుసు. తెలియదు.

పదేళ్ళక్రితంకీ,యిప్పటికీచాల మార్పు వుంది. ఈసంఘం మీద ఆశ వుంది. మనుషుల పైన నమ్మకం వుంది. ఆదర్శాల సాధనలో ధైర్యం వుంది. సంగీతంతో అతని హృదయం పరవశం పొందేది. చిత్రకళలో లీనమై రాత్రులు—పగలు విస్మరించేవాడు. లోకం అందంగా వుండేది. మనుషులు సానుభూతిపరులుగా కన్పించారు. కాని యిప్పుడు చాల విరుద్ధం,

ఆచారాలూ, కులాలూ, ధర్మాలు, హెచ్చు తగ్గులు, యువ్వన స్త్రీపురుషుల కలయికతో యేర్పడే రగడ, ఈర్ష్యాసూయలు కలిసి యీ సంఘం అనే సరోవరం దుర్గంధ పంకమయమయింది. దాంట్లో యెన్నో జీవితాలు మునిగిపోయాయి. అలాగే తనుకూడ అని యీ నీతి బోధకులనీ, సనాతనులనీ తిట్టాడు.

కొన్నాళ్ళు తనలో తను బాధపడ్డాడు. ఆమెతో ఎందుకు తన చరిత్ర చెప్పుకోలేకపోయావా? అని విషయాలన్నీ సావకాశంగా మాట్లాడి, జీవితాల పరిణామాలు ఆనాడే తేల్చుకొని వుంటే బావుండేదే అని వాపోయాడు. కాని, మించిపోయింది.

జీవితం దూరపుకొండలు — పూర్వం.

సమీపించి వికృతాన్ని కని ఏహ్యం — నేడు.

కృష్ణహాయిగా జీవితం గడుపుకొంటున్నాడు అంటారు మిత్రులు. వారికి తన జీవితం దూరపు కొండలు. సుమతిని అలాగే తనూ వూహించుకొంటున్నాడా?

పారంగం నుంచి పోతోంది రైలు. ధ్వని ప్రతిధ్వనిస్తోంది. విద్యుద్దీపాలు చీకటిని చంపేసాయి.

కృష్ణకి తారతమ్యాలు అర్థమయాయి. ఈరైలుపోవటానికి సమతలం అవసరం. కొండలు ఎక్కలేదు. లోయల్లోకి దిగలేదు. పట్టాలు సరిగ్గా వుండాలి. నది దగ్గర వంతెన అవసరం. ఈరైలు నడవాలంటే, యీమార్గంలో, యీ రెండూ అవసరం.

కాని, కూలబోయే వంతెనమీద పోయే రైలు లాంటిది తనజీవితం. ఎక్కడా సర్దుబాటు లేదు. ఆ కొండ యెక్కాల్సిందే. పట్టాలున్నాయి గదా? యీ లోయల్లోకి దిగాల్సిందే. ఆదర్శాల సాఫల్యతకోసం జీవితాన్ని ప్రయోగాలకోసం వినియోగించుకొన్నాడు. బహుశా తన నమ్మకం చాలమందికి మూర్ఖత అనిపించిందేమో!

సుమతి చక్కనిబాట వేసుకొంది. ఈకొండలో యీనదీలోయలూ ఆమె పాలిటి ఆటంకాలు